మార్పు కోసం ...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 185 24 ఆదివారం, డిసెంబర్ 2023 పేజీలు: 4/వెల రూ5/-

విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి కేంద్రాలుగా నడుపబడుతున్న

మరో ఉదయం

(అక్రిడేషన్ కలిగి ఉన్న) తెలుగు దినపత్రికకు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి

సెల్:9154842842

## ఆటో, క్యాబ్ డ్రైవర్లకు

# న్యాయం చేస్తాం

### మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో సమస్యలు

### సిఎం రేవంత్ రెడ్డితో నేరుగా

### చర్చించిన డ్రైవర్లు

### వారికి అండగా ఉంటామని సిఎం రేవంత్ హామీ

హైదరాబాద్,డిసెంబర్23



(మరో ఉదయం):

ఆటో, క్యాబ్ డ్రైవర్లకు న్యాయం చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. వారి సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరిస్తామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోడ్రైవర్లకు కష్టాలు మొదలయ్యాయి. దీంతో తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. నాపంల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో గిగ్ వర్కర్స్‌తో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి సీఎం రేవంత్ చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు. ఎన్నికల ముందు గిగ్ అండ్ ఎ÷-లాట్ ఫార్మ్ వర్కర్లకు న్యాయం చేస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు శనివారం ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్విగ్గి, జొమాటో, ఆటో డ్రైవర్లు, గిగ్ ఎ÷-లాట్ ఫార్మ్ కిందకు వచ్చే ఓలా, ఊబర్, ర్యాపిడో, పోర్టర్, స్విగ్గి, జోమాటో తదితర కంపెనీలో పనిచేస్తున్న వర్కర్లు పాల్గొన్నారు. అయితే మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యాలు కల్పించటం వల్ల ఉపాధి కోల్పోయి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో గిగ్ వర్కర్లు సీఎం రేవంత్‌కు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 20 వేల గిగ్ వర్కర్లు ఉండగా.. తమకి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఎంను కోరినట్టు సమాచారం. రాజస్థాన్ తరహా గిగ్ ప్లాట్ ఫార్మ్ కార్మికుల సంక్షేమ బిల్లు తేవాలని వర్కర్లు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కారరిస్తామన్న ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా తెలంగాణ సీఎం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రేవంత్ రెడ్డి మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తెచ్చారు. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. అయితే ఈ పథకం ద్వారా ఆటో డ్రైవర్లు, ఉబర్, ఓలా సిబ్బంది ఉపాధి కోల్పోయారు. దీంతో వారంత మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలంటూ ఆందోళనలు చేపట్టి బస్ భవన్ ముట్టడికి యత్నించారు. ఈ క్రమంలో వారి పరిస్థితిని అర్థం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి నేడు సమావేశమయ్యారు. ఆటోడ్రైవర్ల సమస్యలను సానుభూతితో పరిశీలిస్తామని ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. వారి సమస్యలు విన్న సీఎం ఆటో, ఊబర్, ర్యాపిడో, ఓలా వర్కర్ల కోసం ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు, ఎలాంటి భరోసా కల్పించనున్నారనేది ప్రాధాన్యతను సంతరించుకుంది. కేబినెట్‌తో చర్చించి.. ఆటో డ్రైవర్లకు, గిగ్ వర్కర్లకు ఓ పథకాన్ని ప్రకటించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## రద్దీకి అనుగుణంగా బస్సులు పెంచుతాం

### కొత్త బస్సుల కొనుగోలుకు నిర్ణయం

### ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి




హైదరాబాద్,డిసెంబర్23(మరో ఉదయం):

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను పెంచేందుకు తెలంగాణ ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న ప్రభుత్వం, త్వరలోనే కొత్త బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. వచ్చే ఏడాది సంక్రాంతి నాటికి 2వందల బస్సులను అందుబాటులోకి తీసుకురానుంది. 50 బస్సులను ఈ నెలాఖరులోపు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎండీ సజ్జనార్ వెల్లడించారు. మరో ఆరు నెలల్లో దాదాపు 2వేల బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు సజ్జనార్. 512 ప్లలె వెలుగు, 400 ఎక్స్‌ప్రెస్‌లు, 92 లహరి స్లీపర్ కమ్ సీటర్, 56 ఏసీ రాజధాని బస్సులు వస్తాయన్నారు. హైదరాబాద్ సిటీలో 540, తెలంగాణలో ఇతర ప్రాంతాలకు 500 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి తీసుకువచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికే కొత్త బస్సులు తెస్తున్నట్లు ఆయన తెలిపారు. బస్ భవన్ ప్రాంగణంలో లహరి స్లీపర్, రాజధాని ఏసీ, ఎక్స్‌ప్రెస్ బస్సులను సజ్జనార్ పరిశీలించారు.

## ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది

### ఘనంగా వీడ్కోలు

### పలికిన గవర్నర్, సిఎం

హైదరాబాద్,డిసెంబర్24(మరో ఉదయం):

తెలంగాణలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన ముగిసింది. శీతాకాల విడిది నిమిత్తం ఈ నెల 18న హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భూదాన్ పోచంపల్లిని సందర్శించారు. గత రాత్రి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం హకీంపేట్‌లో రాష్ట్రపతికి గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అధికారులు వీడ్కోలు పలికారు. అనంతరం ప్రత్యేక విమానంలో ఆమె ఢిల్లీ బయల్దేరారు. ఆమె రాకతో బొల్లారం పరిసరాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.





ఇప్పటివరకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, యూపీ ఇన్చార్జిగా ఉన్న ప్రియాంక యూపీ నూతన ఇన్చార్జిగా సీనియర్ నేత అవినాశ్ పాండే నియామకం

## ప్రియాంక గాంధీని యూపీ ఇన్చార్జి బాధ్యతల నుంచి తప్పించిన

# కాంగ్రెస్ అధిష్ఠానం

ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఇప్పటివరకు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగానూ కొనసాగారు. తాజాగా, కీలక నియామకాలు చేపట్టిన కాంగ్రెస్ అధిష్ఠానం ప్రియాంక గాంధీని యూపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి బాధ్యతల నుంచి తప్పించింది. ఆమె స్థానంలో అవినాశ్ పాండేని యూపీ కాంగ్రెస్ ఇన్చార్జిగా నియమిస్తూ హైకమాండ్ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. అవినాశ్ పాండే మహారాష్ట్రకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత. వృత్తి రీత్యా ఆయన న్యాయవాది. కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి విభాగం నేతగా ప్రస్థానం మొదలుపెట్టి అంచెలంచెలుగా ఎదిగారు. 2010లో ఆయన రాజ్యసభకు కూడా వెళ్లారు.

డిసెంబర్23(మరో ఉదయం)

### తాజాగా కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు

## సీట్లు మార్చినంత మాత్రాన

# గెలవలేరు

### జగన్ సాహసాలు పార్టీని గెలిపించకపోవచ్చు

### చంద్రబాబు, పవన్ కలయిక వారికి బలమే

### ఎపిలో కాంగ్రెస్ పుంజుకునే అవకాశాలు


### మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ వ్యాఖ్యలు

రాజమండ్రి,డిసెంబర్23(మరో ఉదయం):



మిగతా 2 లో

## తెలంగాణలో కొత్తగా 12 మందికి కరోనా



తెలంగాణలో కొత్తగా 12 మందికి కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 8,44,540కు చేరింది. తాజాగా ఒకరు కరోనా నుంచి కోలుకోగా కోలుకున్న వారి సంఖ్య మొత్తం 8,40,391కి పెరిగింది. ప్రస్తుతం 38 మంది చికిత్స పొందుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ బులిటెన్‌లో పేర్కొంది. కొత్తగా 1,322 కొవిడ్ టెస్టులు చేసినట్లు పేర్కొంది. 30 మంది రిపోర్టులు రావాల్సి ఉందని చెప్పింది. రాష్ట్రంలో రికవరీ రేటు 99.51శాతంగా ఉందని, మరణాల రేటు 0.49శాతం ఉన్నట్లు వివరించింది.

మార్పు కోసం ...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## కొత్త వేరియంట్ కలవరం !

కరోనా ముప్పు తొలగిపోలేదని తాజా ఘటనలతో మరోమారు రుజువు అవుతోంది. కొత్త వైరస్ వణికి స్తోంది. దీంతో మనదేశం కూడా అప్రమత్తం కాక తప్పలేదు. ప్రజలకు మళ్లీ హెచ్చరికలు చేయకా తప్పడంలేదు. కేరళలో ఇప్పటికే వైరస్ తీవ్రత మొదలయ్యింది. తమిళనాడులో కూడా కొన్ని కేసులు వచ్చాయి. హైదరాబాద్ నీలోఫర్‌లో చిన్నారికి, భూపాలపల్లి జిల్లాలో ఓ మహిళకు కరోనా ఉన్నట్లు గుర్తించారు. భారత్‌లో కరోనా వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకూ 24 గంటల వ్యవధిలో కొత్తగా 756 కేసులు బయటపడ్డాయి. తాజా కేసులతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 3,420కి పెరిగింది. గత ఏడు నెలల్లో కేసుల సంఖ్య ఇంత చేరడం ఇదే తొలిసారి. ప్రస్తుతం దేశంలో కరోనా కేసులు మళ్లీ పెరగడానికి కొత్త వేరియంట్ జేఎన్.1 కారణమని తెలుస్తోంది. ఇక గత 24 గంటల వ్యవధిలో మహమ్మారి కారణంగా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. కేరళలో ఇద్దరు కాగా, రాజస్థాన్, కర్ణాటకలో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. దీంతో వైరస్ కారణంగా మరణించిన వారి సంఖ్య 5,33,332కి ఎగబాకింది. ఇప్పటి వరకూ దేశంలో కరోనా వైరస్ బారిన పడిన వారి సంఖ్య 4.50 కోట్లకు చేరింది. మహమ్మారి నుంచి 4,44,71,212 మంది కోలుకున్నారు. ఇక మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసుల సంఖ్య 0.01 శాతం మాత్రమేనని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. అదేవిధంగా రికవరీ రేటు 98.81 శాతం, మరణాలు 1.18 శాతంగా ఉన్నాయని తెలిపింది. ఇప్పటి వరకూ 220.67 కోట్ల (220,67,79,081) కరోనా వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసినట్లు వెల్లడించింది. అయితే కొత్త వేరియంట్ ప్రభావం చూపుతున్న క్రమంలో జాగ్రత్తలు అవసరమని హెచ్చరించింది. పండగలతో పాటు, చలి పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని కేంద్రం ఇప్పటికే పలు రాష్ట్రాలను హెచ్చరించింది. తెలుగు రాష్ట్రాల్లో కూడా జెఎన్-1 కొత్త వేరియంట్ లక్షణాలున్న వారిని గుర్తించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, జాగ్రత్తలు పాటించడం మళ్లీ అలవాటు చేసుకోవాల్సిన అసవరం పెరిగింది. చలి పెరగడంతో జాగ్రత్తగా ఉండాలని వైద్యనిపుణులు కూడా హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా కూడా అనేక రుగ్మతలు వచ్చే ప్రమాదం కూడా లేకపోలేదు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర మార్గదర్శకాల నేపథ్యంలో మళ్లీ ఆంక్షల్లోకి వెళ్లాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే అనేక రాష్ట్రాలు ఆంక్షలు విధించడం మొదలు పెట్టాయి. దీంతో వరుసగా వస్తున్న క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండగల సందర్భంగా ఒకేచోట వేలమంది గుమి గూడే పరిస్థితి ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి అవసరాన్ని ప్రస్తుత పరిస్థితులు సూచిస్తున్నాయి. ఈ మేరకు కేంద్రం కూడా ఆయా రాష్ట్రాలకు సూచించింది. ఈ క్రమంలో ఇక పండగల వేళ మళ్లీ సందడి లేకుండా పోయే రోజులు వచ్చాయన్న ఆందోళన సహజంగానే కలుగుతోంది. అయితే మన జాగ్రత్తలో మనం ఉంటూ ముందుకు సాగడం ద్వారా కొత్త వైరస్ వ్యాప్తిని అరికట్టాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతిపైనా దీని ప్రభావం పడనుంది. అంతకు ముందే న్యూ ఇయర్ వేడుకలపైనా ప్రభావం చూప నుంది. మొత్తంగా న్యూ ఇయర్ వేడుకల నిర్వహణలో పలు జాగ్రత్తలు పాటించాలి. అయ్యప్ప భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం హెచ్చరించింది. రెండేళ్లక్రితం కూడా ఇలాంటి పరిస్థితే వచ్చింది. దీంతో క్రిస్మస్, న్యూఇయర్ వేడుకలపై తీవ్ర ప్రభావం పడింది. ఆంక్షలే విధిస్తే..కరోనా మళ్లీ విజృంభిస్తే ఇది ఓ రకంగా చిన్న వ్యాపారులకు తీరని దెబ్బ కాగలదు. ఇప్పటికే కరోనా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశించింది. మరోవైపు కోవిడ్ మార్గదర్శకాలను ఎప్పటి కప్పుడు

పాటించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కేంద్ర మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించడం తో వైరస్ వ్యాప్తిని గుర్తించి ప్రజలు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలి. కొత్త వేరియంట్ విజృంభిస్తున్ననం దున ప్రభుత్వాలు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా హెచ్చరిం చాయి. పండుగలకు పెద్ద ఎత్తున జనం గ్రామాలకు వెళ్లే అవకాశం ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని ఆదేశించింది. గ్రామాలకు వెళ్లేవారు జగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని పరోక్షంగా చెప్పింది. ఈ క్రమంలో ఇప్పటికే అనేక రాష్ట్రాలు ఆర్టీపిఎస్ పరీక్షలకు రంగం సిద్ధం చేసాయి. ఆస్పత్రులను వైద్య సేవలకు అనుగుణంగా సిద్ధం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు వంటి రాష్ట్రాలు కోవిడ్ నిబంధనల మేరకు చర్యలకు ఉపక్రమించాయి. అయితే కొత్తగా వ్యాప్తి చెందుతున్న జెఎన్-1 డేంజర్ కాదని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. కానీ కేసుల సంఖ్యలో రోజురోజుకూ మార్పులు వస్తున్నాయి. క్రమంగా కేసుల సంఖ్య పెరుగుతోంది. అయినా మనం భయపడాల్సిన అవసరం లేదని కూడా అంటున్నారు. ఇకపోతే దేశంలో ఇప్పటికే 90 శాతానికిపైగా రెండు వ్యాక్సిన్ డోసులు తీసుకున్నారు. అందులో దాదాపు 90 శాతం మంది కొవిడ్ బారిన పడ్డారు. తద్వారా వారిలోని సహజ రోగనిరోధక శక్తి పెరిగింది. ఇలా మనదేశంలో హైబ్రిడ్ ఇమ్యూనిటీ ఉన్నందున కొత్త వేరియంట్లు పెద్దగా ప్రభావం చూపడం లేదని పేర్కొంటున్నారు. అయినా అప్రమత్తంగా ఉండడం మంచిదని సూచిస్తున్నారు. ఇకపోతే మొత్తంగా ఇప్పుడు తాజా పరిస్థితులను చూస్తుంటే ముప్పు కళ్లముందే కనిపిస్తోంది. విందులు.. వినోదాలు..ఆటపాటల్లో జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. మొత్తంగా కొవిడ్ భయం మరోసారి వచ్చేస్తోంది. దేశప్రజలకు కొవిడ్ పట్ల జాగ్రత్తలు అవసరమేనని సూచించిన వెంటనే వైద్య,ఆరోగ్యశాఖ ప్రత్యేక నిబంధనలు జారీ చేసింది. ప్రతి చోటా మాస్కులు తప్పనిసరిగా వాడటం ఉత్తమమని సూచిస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

# సీట్లు మార్చినంత మాత్రాన గెలవలేరు

రాజకీయాల్లో జగన్‌కు అంత అనుభవం లేదని సీట్లు మార్చే పక్రియ సరికాదని రాజమండ్రి ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. ఏపీలో ఎమ్మెల్యేలకు ఎక్కడా అధికారం లేదు.. అధికారం అంతా జగన్ మోహన్ రెడ్డి, వాలంటీర్ల చేతుల్లో మాత్రమే ఉందని ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. అప్పులు చేసి సంక్షేమ పథకాల పేరుతో డబ్బులు పంచడం ఎక్కడా చూడలేదని జగన్ మోహన్ రెడ్డి దేశంలోనే గొప్ప ప్రయోగం చేశాని సెటైర్ వేశారు. రాజమండ్రిలో మీడియాతో మాట్లాడిన ఆయన పవన్ కళ్యాణ్ చంద్రబాబు కలవడం కచ్చితంగా వాళ్లకి బలమే అవుతుందని అన్నారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటుందని, తెలంగాణ ఎన్నికల ప్రభావం కచ్చితంగా కనపడుతుందని ఉండవల్లి పేర్కొన్నారు. రాజకీయాల్లో త్యాగాలు చేయడానికి ఎవరూ రారన్నారు. సీటు లేదని చెప్పాలంటే దానికి చాలా అనుభవం ఉండాలన్నారు. అటువంటి అనుభవం జగన్ మోహన్ రెడ్డికి ఉందని నేను అనుకోవడం లేదు. టికెట్లు మార్చే పక్రియ సరికాదు. టికెట్లు మార్చకపోతే అక్కడ కేసీఆర్ ఓడిపోయారు.. మార్చితే ఇక్కడ జగన్ గెలుస్తారని అనుకోవడం కూడా సరికాదని ఉండవల్లి అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ అంటే వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అమితమైన అభిమానం. అటువంటి నెహ్రూను విజయసాయి పార్లమెంట్లో తప్పుపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో హిందుత్వం తగ్గుతుందని అనడం వాస్తవం కాదని ఉండవల్లి అన్నారు. జేడీ పార్టీ పెట్టడం ద్వారా సీట్లు సాధించకపోవచ్చు.. కానీ ఓట్లు ఎంత శాతం సంపాదిస్తుంది అనేది రాజకీయ పరిణామాలు మారడానికి అవకాశం ఉందని ఉండవల్లి తెలిపారు. చంద్రబాబు నాయుడు, జగన్మోహన్ రెడ్డి నిజాయితీగల పార్టీని నడపడం రాక కాదు, నడపడం వల్ల ప్రయోజనం లేదని విశ్లేషించారు. రాజమండ్రిలో విచ్చలవిడిగా భారీ వృక్షాలను నరికేస్తున్నారు.. వెంటనే దాన్ని ఆపాలి. మళ్లీ ఎటువంటి చెట్లు పెంచడం మన వల్ల కాదని అన్నారు. లోక్ సభలో 150 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం సరియైన పద్ధతి కాదని ఉండవల్లి అన్నారు. పార్లమెంట్ లో ప్రవేశించిన దుండగుడికి ఆ పాసులు ఇచ్చిన ఎంపీని ఇప్పటిదాకా విచారించలేదు. ఇంత మందిని సస్పెండ్ చేయడం నేనెప్పుడూ చూడలేదని అన్నారు. తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు చక్కగా జరుగుతున్నాయి. అటువంటి పరిస్థితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లేదని ఉండవల్లి అన్నారు.

# నేడు కలెక్టర్లతో సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష

### క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం లక్ష్యంగా చర్చ

### ప్రజాపాలన పేరుతో గ్రామాల్లో సమస్యలపై అర్జీల స్వీకరణ

### అక్కడికక్కడే పరిష్కరించేలా కలెక్టర్లకు దిశానిర్దేశం

**హైదరాబాద్,డిసెంబర్23 (మరో ఉదయం)**

తెలంగాణ ప్రభుత్వం మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతోంది. ప్రజల్లోకి వెళ్లేందుకు వారి సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇప్పటికే 'ప్రజా వాణి' పేరుతో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తుండగా, పరిపాలనను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లి, అక్కడే సమస్యలకు పరిష్కారం చూపేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ప్రజాపాలన పేరుతో ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు, పది రోజుల పాటు ప్రజాపాలన పేరుతో ప్రత్యేక కార్యక్రమా నికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టబోతున్నారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక యంత్రాంగం, గ్రామస్థాయిలో సదస్సులు నిర్వహించి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోనుంది. వాటిని అక్కడికక్కడే పరిష్కరించేలా కసరత్తు చేస్తోంది. ఆదివారం కలెక్టర్లతో జరిగే సమాశంలో ప్రజాపాలనపై సీఎం రేవంత్ రెడ్డి చర్చించనున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత తొలిసారి సిఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో భేటీ కాబోతున్నారు. ఈ సమావేశంలో పలు అంశాలతో పాటు ప్రబుత్వం కొత్తగా నిర్వహించ బోయే ప్రజాపాలనపైనా మార్గనిర్దేశనం చేసే అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 24న ఆదివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించనున్నారు. ప్రజావాణిలో వస్తున్న దరఖాస్తులు, భూ రికార్డులతో ముడిపడిన సమస్యలు, కౌలు రైతుల గుర్తింపు, కొత్త రేషన్ కార్డుల జారీ, మహాలక్ష్మి తదితర పథకాల అమలుపై వారితో చర్చించనున్నారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలపై తగిన సమాచారంతో సమీక్షకు హాజరు కావాల్సిందిగా శుక్రవారం కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి.గ్రామ స్థాయిలో విద్య, వైద్యం, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సిఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం. జిల్లా అధికారులు గ్రామాలకు వెళ్లి నేరుగా ప్రజలతో మాట్లాడనున్నారు. తొలుత పది రోజుల పాటు గ్రామస్థాయిలో ప్రజాపాలన నిర్వహించనుంది. ఆ తర్వాత అవసరమైతే మరోసారి నిర్వహించడంపై ఆలోచన చేస్తోంది. ఆరు గ్యారెంటీల లబ్ధిదారుల ఎంపికకు ఈ నెల 28 నుంచి దరఖాస్తుల స్వీకరించాలని నిర్ణయించింది. రూ.500కు గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ.2,500 నగదు బదిలీ, పెన్షన్ల పెంపు, ఇంటి నిర్మాణానికి 5 లక్షల నగదుసాయం, కొత్త రేషన్ కార్డుల జారీ కోసం దరఖాస్తులు స్వీకరించనుంది. తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రత్యేకతను చాటుకుంటున్నారు. సమీక్షలు, సమావేశాలతో బిజీగా ఉంటూనే, ఆరు గ్యారెంటీల అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజా పాలన అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. రోజురోజుకో సరికొత్త కార్యక్రమాల్లో పాలన సాగిస్తూ.. ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేసే క్రమంలో ప్రతి మంగళవారం, శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 'ప్రజా వాణి' నిర్వహిస్తున్నారు. ప్రజా భవన్ లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తొలి రోజు నుంచే విశేష స్పందన లభిస్తోంది. భూసమస్యలు, రెండు పడక గదుల ఇళ్లు మంజూరు, నిర్మాణం, వివిధ రకాల పింఛన్లకు సంబంధించిన వినతులే ఎక్కువగా వస్తున్నాయి. మండల స్థాయిలో పరిష్కార మయ్యే సమస్యల కోసం ప్రజలు వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్ ప్రజా భవన్ కు వస్తున్నారు. దీంతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అందుకు అనుగుణంగా 'ప్రజా పాలన'కు శ్రీకారం చుట్టారు.

# 2024 గగన్‌యాన్‌కు ఇస్రో సంసిద్ధత

### మానవరహిత విమాన పరీక్షలకు సిద్ధం

### ఇస్రో చైర్మన్ సోమ్ నాథ్ వెల్లడి

**బెంగళూరు,డిసెంబర్22 (మరో ఉదయం):**

2024లో గగన్ యాన్ మిషన్‌కు అంతా సిద్ధం చేస్తున్నట్లు ఇస్రో చైర్మన్ సోమ్‌నాథ్ తెలిపారు. క్రూ ఎస్కేప్ సిస్టమ్ మానవ రహిత విమాన పరీక్షలకు ఇస్రో సిద్ధమవుతోంది. మొదటి డెవలప్ మెంట్ ఫ్లైట్ టెస్ట్ వెహికల్ తయారీ చివరి దశలో ఉన్నందున గగన్ యాన్ మిషన్ కోసం మానవ రహిత విమాన పరీక్షలను త్వరలో ప్రారంభిస్తామని భారత అంతరిక్ష సంస్థ ఇప్పటికే ప్రకటించింది. గగన్ యాన్ ప్రాజెక్ట్ లో భాగంగా భూమికి 400 మీటర్ల ఎత్తులో ఉన్న వృత్తాకార కక్ష్యలోకి ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులతో కూడిన సిబ్బందిని ఇస్రో ప్రవేశపెట్టనుంది. ఈ మిషన్ ఒకటి నుంచి మూడు రోజులు పడుతుం దని.. వ్యోమగాములు సురక్షితంగా భూమికి తిరిగి రావడానికి కావాల్సిన సిస్టమ్ పై దృష్టి సారించామని ఇస్రో చైర్మన్ సోమ్ నాథ్ తెలిపారు. గగన్‌యాన్ మిషన్ కోసం ఇస్రో తన లైఫ్ సపోర్ట్ సిస్టమ్ టెక్ని అభివృద్ధి చేస్తుందని ఇస్రో చైర్మన్ ఎస్. సోమ్‌నాథ్ వెల్లడించారు. ఇతర దేశాలు తమ రీసెర్చ్ లను పంచుకునేందుకు ఇష్టపడవని చైర్మన్ తెలిపారు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనేజేషన్ (ఇస్రో) 2023లో చంద్రయాన్3 తో సహా అనేక సక్సెస్ ఫుల్ అంతరిక్ష ప్రయోగాలతో యూనివర్సల్ హిస్టరీ మేకర్ అయిందని సోమ్ నాథ్ అన్నారు. ఇస్రో చేసిన అంతరిక్ష పరిశోధనలకు ప్రపంచం ప్రశంసలు కురిపించిందన్నారు. ఇస్రో మరో అంతరిక్ష ఫ్లైట్ మిషన్.. గగన్ యాన్.. దీనికోసం లైఫ్ సపోర్ట్ సిస్టమ్ టెక్నాలజీని పంచుకోవ డానికి ఇతర దేశాలు పంచుకోవడానికి సిద్ధంగా లేవన్నారు. అయినప్పటికీ స్వదేశీ ఎన్విరాన్ మెంటల్ కంట్రోల్ లైఫ్ సపోర్ట్ సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నందున ఇస్రో ఆశయానికి ఎలాంటి అడ్డంకులు లేవని సోమ్ నాథ్ ప్రకటించారు. ఈ మిషన్ తో భారత్ మరోసారి చరిత్ర సృష్టిస్తుందన్నారు. మనోహర్ పారికర్ విద్వాన్ మహోత్సవ్ 2023లో ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ..పర్యావరణ నియంత్రణ, లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయడంలో మాకు అనుభవం లేదు. రాకెట్లు, ఉపగ్రహాలు మాత్రమే రూపొందిస్తున్నాం..అయితే ఈ సపోర్టు ను ఇతర దేశాలనుంచి ఆశించాం. ఏ ప్రభుత్వమూ క్లిష్టమైన పరిజ్ఞానాన్ని అందించేందుకు సిద్ధంగా లేదు. దశాబ్దాల కాలంగా సహకారం, సాంకేతికత పురోగతి ద్వారా నాసా(అమెరికా), రోస్కోస్మోస్ (రష్యా), ఇఎస్ఎ యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ) వంటి అంతరిక్ష సంస్థలు ఇసిఎల్ఎస్ఎస్ వ్యవస్థల అభివృద్ధికి సహకారాన్ని అందించాయి. అయినప్పటికీ సంబంధిత పరిశోధలను ఇస్రోతో పంచుకోవడంలో వారు విముఖత చూపారని..దీంతో ఇసిఎల్ఎస్ఎస్ వ్యవస్థను స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించాలని ఇస్రో నిర్ణయించింద న్నారు. సాంకేతిక.. అంతరిక్షంలోని అనేక సవాళ్లతో కూడిన వాతావరణంలో వ్యోమగామి మనుగడకు అవసరమైన గాలి నాణ్యత, నీటి సరఫరాను నిర్వహిస్తుంది. యాక్టివేటెడ్ చార్ కోల్ బెడ్లు, ఉత్ప్రేరక ఆక్సిడైజర్లు, మాలిక్యులర్ జల్లెడలతో కూడిన ఖచ్చితమై మెకానిజమ్‌ల ద్వారా ఈ వ్యవస్థ క్యాబిన్ గాలి నాణ్యతను నియంత్రిస్తుంది. సిబ్బందికి శ్వాసక్రియ వాతావరణాన్ని నిర్ధారిస్తుంది.

# ఎన్నికల హామీలను అమలు చేస్తాం

### ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతాం

### అప్పులు ఉన్నా హామీలను నెరవేరుస్తాం

### క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పొంగులేటి హామీ

**ఖమ్మం,డిసెంబర్23(మరో ఉదయం):**

ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు వందశాతం పూర్తి చేస్తామని రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కూసుమంచి మండలం, పాలేరు గ్రామంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి, క్రిస్టమస్ బహుమతుల పంపిణీ చేశారు. పాలేరు నియోజకవర్గంలో కళ్యాణలక్ష్మి/శాదిముబారక్ లబ్ధిదారులకు చెక్కులు, విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన వారి సంబంధికులకు ఎక్స్ గ్రేషియా చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, ప్రతి ఒక్కరికి మంచి జరుగుతుందని తెలిపారు. అనేకమంది ఇండ్లు అడుగుతున్నారని, ధరణితో ఇబ్బందులు పడుతున్నారని, ఇండ్ల మంత్రిగా, రెవిన్యూ మంత్రిగా అందరికి న్యాయం చేస్తామన్నారు. ప్రతి ఇంటికి ఆరు గ్యారెంటీలు తీసుకొని వెళ్లారని ఆయన అన్నారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ లను తప్పక నెరవేర్చుతామని అన్నారు. అక్రమ కేసులు అన్నింటినీ పరిష్కరిస్తామన్నారు ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పామని తెలిపినట్లు, ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేసినట్లు ఆయన అన్నారు. రెండు మూడు రోజుల్లో తీపి వార్త వింటారని, హామీల్లో కొన్ని అమలుచేయనున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం ఆరు లక్షల డెబ్బై ఒక్క వేల 734 కోట్ల రూపాయల అప్పులు చేసిందని ఆయన అన్నారు. ఇరవై నాలుగు గంటల కరెంట్ ఇస్తున్నామని చెప్పిన గత ప్రభుత్వం 81 వేల కోట్ల రూపాయల అప్పులు చేసి ఒప్పచెప్పినట్లు మంత్రి అన్నారు. ఎన్ని అప్పులు ఉన్న, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఆయన అన్నారు. గతంలో ఆగి పోయిన పనులకు సంబంధించి, అధికారులకు సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు. ఏ ఒక్క అధికారికి డబ్బులు తీసుకుని పోస్టింగ్ లు ఇవ్వమని, ప్రజల నుంచి అధికారులు ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పని చేయాలని, మంచి పరిపాలన అందించాలని మంత్రి అన్నారు. ప్రజలు కోరుకునే ఇందిరమ్మ రాజ్యం కోసం అధికారులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంత్రి కేక్ కట్ చేశారు. ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి. గణెశిష్, ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమూది, విద్యుత్ శాఖ ఎడిఇ కొక్యా నాయక్, పాలేరు నియోజకవర్గ మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఓ లు, ఎంపిపి లు, జెడ్పిటిసిలు, సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు

మరో ఉదయం

# ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ఘనుడు పివి

## తెలంగాణ భవన్‌లో

## నివాళి అర్పించిన భట్టి

**న్యూఢిల్లీ,డిసెంబర్24(మరో ఉదయం):**

తెలంగాణ భవన్‌లో మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావు వర్ధంతి కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరై నివాళులర్పించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ.. పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నామన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ఘనత పీవీ సొంతమన్నారు. విద్యా వ్యవస్థ, అనేక సామాజిక మార్పులకు ఎంతో కృషి చేశారన్నారు. పీవీ నరసింహారావు లాంటి గొప్ప వ్యక్తి తెలంగాణలో పుట్టడం అందరికి గర్వకారణమన్నారు. మొట్టమొదటి సారి గురుకుల పాఠశాలల రూపకల్పన ఘనత పీవీ కే దక్కుతుందన్నారు. భూ సంస్కరణలు అమలు చేసిన చేసిన సాహసి పీవీ నరసింహారావు అని కొనియాడారు. పీవీ నరసింహారావు లాంటి శక్తివంతమైన నాయకుడిని ప్రధానిని చేసింది కాంగ్రెస్ అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శనివారం నాడు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్లో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 19వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది.. తెలంగాణ భవన్ లోని అంబేద్కర్ ఆడిటోరియంలో రెసిడెంట్ కమిషనర్ డా.గౌరవ్ ఉప్పల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిధిగా హాజరయ్యి పి.వి నరసింహారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ పీవీ నరసింహారావు భారత దేశ ప్రధానిగా, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టారని అలాంటి పీవీ తెలంగాణలో పుట్టడం గర్వంగా భావిస్తున్నానన్నారు. చిన్న నాటి నుంచే పీవీకి దేశం అంటే చాలా ప్రేమ అని అదే విధంగా ఆయనకు అనేక భాషలపై మంచి పట్టుందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా భూసంస్కరణల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్న మహానుభావుడు పీవీ నరసింహారావు అని అన్నారు. పీవీ నరసింహారావు ఎన్నో గొప్ప సాహస నిర్ణయాలు తీసుకున్నారు అని తెలిపారు. పీవీ పాలనా దక్షత ఇతర రాష్ట్రాలకు ఉదాహరణగా నిలిచిందని,ఆయన పాలనా అనుభవం అందరికీ స్ఫూర్తిదాయకమని, దేశం ఆర్థికంగా, రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా పీవీ కీలక భూమిక పోషించారన్నారు. అదే విధంగా పీవీ పాలనా దక్షత అనితర సాధ్యం అని ఆయన చెప్పారు. పీవీ ఆలోచనలను, మార్గాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు భవిష్యత్ తరాలు నడుం బిగించడమే, మనం ఆయనకిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భవన్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# పివికి ఘనంగా నివాళి అర్పించిన గుత్తా

## బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రశంసలు

**నల్లగొండ,డిసెంబర్24(మరో ఉదయం):**

మాజీ ప్రధానమంత్రి, దివంగత నేత పీవీ నరసింహా రావు వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్మరించుకున్నారు. నల్గొండలోని క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బహుముఖ ప్రజ్ఞాశాలి, అనేక భాషల్లో అనర్గళంగా మాట్లాడే గొప్ప మేధావి పీవీ నరసింహా రావు అన్నారు. ఆయన రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు ఎనలేని సేవ చేశారన్నారు. దేశానికి ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించి తెలుగువాడి ఖ్యాతిని ప్రపంచ స్థాయికి పెంచారని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కనగల్ జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఐతగొని స్వామి గౌడ్, గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర రావు, హరికృష్ణ, మాజీ ఎంపీపీ దైదా రజిత రెడ్డి, రామలచ్చయ్య, మునాస వెంకన్న, చిలకరాజు శ్రీనివాస్, కేశవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వరాలయంలో మంత్రి పొన్నం పూజలు

**సిద్దిపేట,డిసెంబర్24(మరో ఉదయం):**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా స్వామి వారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తనను గెలిపించిన హుస్నాబాద్ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యలను పరిష్కరించేలా తనకు భగవంతుడు ఆశీస్సులు అందించాలని వేడుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఆలయంపై రాజకీయాలు వద్దు: గండ్ర

**జయశంకర్ భూపాలపల్లి,డిసెంబర్24(మరో ఉదయం):**

భూపాలపల్లిలో ప్రజల కోసం, లోక కళ్యాణార్థం నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంపై రాజకీయం చేయడం సరికాదు అని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెకంటరమణారెడ్డి పేర్కొన్నారు.ఆలయం రాత్రికి రాత్రి నిర్మించింది కాదు. జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య శంకుస్థాపన చేయడం జరిగింది. గుడి నిర్మాణం పూర్తయిందని తెలిపారు. ఆలయం పక్కనే అర్చకులకు, సూపర్‌వైజర్లకు, వంట మనుషులకు, దేవుని సామాగ్రి భద్రపరచడం కోసం, భక్తులు విశ్రాంతి తీసుకోవడం కోసం గదులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పుడు గుడి పనులను ఆపడం, నోటీసులు ఇవ్వడం రాజకీయ కుట్రలో భాగమే. ప్రజలంతా దీన్ని గమనిస్తున్నారు అని గండ్ర వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు.

# సంస్కృత పరిరక్షణ కోసం కృషి చేయాలి

## దేవభాషలో ప్రమాణం చేసిన ముస్లిం ఎమ్మెల్యేలు

**జైపూర్,డిసెంబర్24(మరో ఉదయం):**

సాధారణంగా అసెంబ్లీలో ఎమ్మెల్యేలు తమ మాతృ భాష లేదంటే ఇంగ్లీష్‌లో ప్రమాణ స్వీకారం చేస్తుంటారు. కానీ రాజస్థాన్‌కి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు సంస్కృతంలో ప్రమాణ స్వీకారం చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. అందులోనూ ఎమ్మెల్యేలిద్దరూ ముస్లింలు కావడం ఆసక్తిని రేకెత్తించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన జుబేర్ ఖాన్ విజయం సాధించారు. తాజాగా రాజస్థాన్ అసెంబ్లీలో స్పీకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే జుబేర్ ఖాన్ పోడియం దగ్గరికి వచ్చి సంస్కృతంలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ టిక్కెట్ నిరాకరించడంతో యూనుస్ ఖాన్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయన మాజీ సీఎం వసుంధర రాజేకి సన్నిహితుడు. ఎన్నికల్లో గెలుపొందిన ఆయన సంస్కృతంలో ప్రమాణం చేసి ఆకట్టుకున్నారు. ఆ భాషలోనే ఎందుకు ప్రమాణం చేశారని వారిని అడగ్గా... అంతరించి పోతున్న భాషలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులుగా తమపై ఉందని చెప్పారు. వీరిపై నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

# బాబు ముందస్తు బెయిల్ తీర్పు రిజర్వ్

**అమరావతి,డిసెంబర్23(మరో ఉదయం):**

ఇన్నర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. ప్రభుత్వం దాఖలు చేసిన లిఖిత పూర్వక వాదనల్లో టీడీపీ నేత లోకేష్‌పై చేసిన వ్యాఖ్యలపై టీడీపీ న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా చంద్రబాబు తరపు న్యాయవాదులు శనివారం హైకోర్టులో దాఖలు చేశారు. వీటిని పరిశీలించిన హైకోర్టు నాయమూర్తి.. చంద్రబాబు ముందస్తు బెయిల్‌పై తీర్పును రిజర్వ్ చేశారు.

# అన్ని మతాలు కాంగ్రెస్‌కు సమానమే

## క్రైస్తవుల హక్కులు కాపాడుతాం: పొన్నం

**సిద్దిపేట,డిసెంబర్23(మరో ఉదయం):**

క్రైస్తవుల సమస్యలు, ఇబ్బందులను పరిష్కరించి వారి హక్కులను కాపాడుతానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం నాడు హుస్నాబాద్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ... అన్ని మతాలను కాంగ్రెస్ పార్టీ గౌరవిస్తుంది. రాష్ట్రంలో ఎంత ఆర్థిక సంక్షోభం ఉన్న సంక్షేమ కార్యక్రమాలన్ని అమలు చేస్తాం. హుస్నాబాద్‌లోని మోడల్ స్కూల్ లో విద్యార్థులకు కారం పెట్టిన ఘటనపై కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.హుస్నాబాద్‌లో మెడికల్ కాలేజ్, ఆర్టీవో కార్యాలయం ఏర్పాటుకు స్థల సేకరణ చేస్తున్నామన్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి, భూ నిర్వాసితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసేలా కృషి చేస్తానని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేయనని అన్నారు. రాజకీయాలకు అతీతంగా హుస్నాబాద్ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. 24 గంటలు నియోజర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.




# పదవులు ఎవరికి శాశ్వతం కాదు

## అభివృద్ధి ఎంత చేశామనేదే ముఖ్యం

## సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**సూర్యాపేట,డిసెంబర్23(మరో ఉదయం):**

పదవులు ఎవరికి శాశ్వతం కాదని, అభివృద్ధి ఎంత చేశామనేదే ముఖ్యం అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట నియోజకవర్గం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు. పశువైద్య, ఉద్యానవన, నీటి పారుదల, వ్యవసాయ, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖ, ప్రాథమిక విద్య, పౌర సరఫరా, ఆరోగ్య, రోడ్లు రహదారులతో పాటు పలు శాఖల ఆధ్వర్యంలో జరిగిన, జరుగుతున్న, జరగాల్సిన అభివృద్ధి పనులపై సంబంధిత శాఖ అధికారులతో జగదీశ్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు పల్లెలు, పట్టణాలు ఎలా ఉన్నాయో, బీఆర్ఎస్ హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో అధికారులే సాక్షమని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రతినిధులు పనిచేయాల న్నారు. మీరు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులు భవిష్యత్తు తరాలకు చిహ్నంగా నిలబడాలని సూచించారు. గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో పార్టీలకతీతంగా అభివృద్ధి జరిగిందన్నారు. అదే తరహా పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఆశిస్తున్నామని అన్నారు. గ్రామాల్లో జరగవలసిన పనులపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి అభివృద్ధి కొనసాగించేందుకు పూర్తిగా మద్దతు తెలుపుతామని, అవసరమైతే పోరాటాలకు కూడా సిద్ధమని ఆయన అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు ప్రభుత్వం చేపడితే తమకు పోరాటాలు కొత్తేమీ కాదన్నారు. తాను ఎనిమిదో తరగతి చదువుతున్నప్పటి నుంచి పోరాటాలు చేస్తున్నామని గుర్తు చేసుకు న్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి భాగస్వామ్యం కావాలని సర్పంచ్‌లకు సూచించారు. కేసీఆర్ ఏ విధంగా రాష్ట్రం అభివృద్ధి చేయాలని చిత్తశుద్ధితో పనిచేశారో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామాలు, వార్డుల అభివృద్ధికి కృషి చేయాలి అని కోరారు. ఎంపీపీ నెమ్మాధి బిక్షం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జడ్పీటీసీ మామిడి అనిత అంజయ్య,

వైస్ ఎంపీపీ సింగా రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాతాల జానకి రామ్ రెడ్డి, వెన్న సీతారాం రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ స్వేదపత్రం నేటికి వాయిదా

**హైదరాబాద్,డిసెంబర్23(మరో ఉదయం):**

బీఆర్ఎస్ స్వేదపత్రం నేటికి వాయిదా పడింది. ఆదివారం ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్ఎస్ స్వేదపత్రంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇక ఇవాళ మధ్యాహ్నం ఒంటి గంటకు కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ చేయనున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు బీఆర్ఎస్ స్వేదపత్రాన్ని విడుదల చేస్తామని, అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని నిన్న కేటీఆర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. స్వేద పత్రం కోసం టీఆర్ఎస్ శ్రేణులు, రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురుచూశారు.

# కలసి పోరాడితేనే జగన్‌ను ఓడిస్తాం

## తెలంగాణలో అలాగే విజయం సాధించాం

## ఇక్కడా అన్ని పార్టీలు కలసి ముందుకు రావాలి

## పార్లమెంట్‌ను రక్షించలేని బిజెపివి డ్రామాలు

## సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వ్యాఖ్య

**న్యూఢిల్లీ,డిసెంబర్23(మరో ఉదయం):**

ఏపీలో రాజకీయ పరిస్థితులు అనిశ్చితంగా ఉన్నాయని, జగన్‌ను ఎదుర్కోవాలంటే ఏపీలో అన్ని పార్టీలు కలవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సూచించారు. కలసి పోరాడితేనే జగన్‌ను ఓడించగలుగుతామని అన్నారు. తెలంగాణలో ఇలానే విజయం సాధ్యమయ్యిందని అన్నారు. ఇందుకోసం ఇండియా కూటమిలో ఉన్నవారితోనే తమ పొత్తులని తేల్చారు. ఏపీలో పార్టీలు అన్నీ కేంద్ర హోంమంత్రిని, బీజేపీని చూసి భయపడుతున్నాయని నారాయణ అన్నారు. మోడీని వ్యతిరేకిస్తే తమకు ఎక్కడ ఇబ్బందులు సృష్టిస్తారో అని వారంతా భయపడుతున్నారని, ఇండియా కూటమికి అనుకూలంగా ఉండేవారితోనే మా పొత్తులు ఉంటాయని నారాయణ స్పష్టం చేశారు. బీజేపీ వల్ల రెండు తెలుగు రాష్ట్రాలు నష్టపోయాయని, ప్రత్యేక హోదా సహా ఏదీ రాలేదన్నారు. తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసిన పార్టీ ఏదైనా ఉందంటే అది బీజేపీయే. వారితో అంటకాగే పార్టీలకు కూడా ప్రజలు ఓటు వేయరు. జగన్‌కు వ్యతిరేకంగా టీడీపీ, జనసేన, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు కలిసి వెళ్ళాలి అన్నది మా ఉద్దేశం. టీడీపీని ఇండియా కూటమిలోకి ఆహ్వాని స్తున్నాం. పోల్ మేనేజ్‌మెంట్‌కు భయపడి వారు బీజేపీ పొత్తు కోసం ఆరాటపడుతున్నారని నారాయణ అన్నారు. పార్లమెంట్‌నే కాపాడలేని అసమర్థులు భారతదేశాన్ని ఎలా కాపాడతారని మోదీ ప్రభుత్వాన్ని నారాయణ ఎద్దేవా చేశారు. శనివారం నాడు ఢిల్లీలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...భారతదేశ చరిత్రలో ఇంత మంది ఎంపీలను సస్పెండ్ చేసిన ఘటన గతంలో ఎప్పుడూ లేదు. వారు చేసిన తప్పేంటి? పార్లమెంట్‌పై దాడి ఘటనపై చర్చకు పట్టుబట్టారు. ఒకవేళ ఏదైనా జరిగితే సభ్యులు చనిపోయేవారు కదా? బీజేపీ ఎంపీ పాస్ ఇవ్వడం నిజమా కాదా? పొరపాటున ఏ ఓఎం ఎంపీ ఇచ్చి ఉంటే ఏం చేసేవారు? పార్లమెంట్‌నే కాపాడలేని అసమర్థులు భారతదేశాన్ని ఎలా కాపాడతారు? ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిందని నా అనుమానం అని నారాయణ అన్నారు. ఎన్నికల్లో లబ్ది కోసం చేసిన నాటకీయ పక్రియలా అనిపిస్తోంది. లేదంటే ఈ విషయంలో ఎంత సీరియస్‌గా వ్యవహరించాలి? అలాంటిదేమీ కనిపించడం లేదే? ఎన్నికల జిమ్మిక్‌లో భాగంగానే పార్లమెంట్‌లో ప్రమాదకర గేమ్ ఆడారు. ఇండియా కూటమికి దేశంలో జనాదరణ పెరుగుతుంది కాబట్టి ఇలా కుయుక్తులు పన్నుతున్నారు. రామజన్మభూమి ఆలయానికి వ్యూహాత్మకంగా అందరినీ పిలిచారు. బాబ్రీ మసీదు కూలగొట్టడానికి ఆద్యుడు ఎల్కే అద్వానీ. కానీ ఆయనని రానివ్వడం లేదు. అద్వానీ వస్తే పేరు ఆయనకే వెళ్తుంది. అది మోదీకి ఇష్టం లేదు. అందుకే అద్వానీ, మురళీ మనోహర్ జోషికి ఆహ్వానం లేదు. ఉపరాష్ట్రపతిని మిమిక్రీ చేశామని గోల చేస్తున్నారు. అది ఒక కళ. ఇండియా కూటమి పొత్తులు తెలంగాణలో విజయం సాధించాయి అని నారాయణ పేర్కొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల వేడి

## లెక్టర్లు, ఎస్పీలతో ఈసీఐ ప్రతినిధుల

**విజయవాడ,డిసెంబర్23(మరో ఉదయం):**

రెండు రోజులుగా కేంద్ర ఎన్నికల బృందం పర్యటిస్తూండటంతో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల వేడి రాజుకుంటోంది. రెండో రోజు కలెక్టర్లు, ఎస్పీలతో ఈసీఐ ప్రతినిధుల సమావేశం ముగిసింది. రెండో రోజు సమావేశంలో సీఎస్, డీజీపీ, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఐటీ, కస్టమ్స్, రైల్వేతో పాటు పలు కేంద్ర సంస్థల అధికారులతో సమావేశం కొనసాగుతోంది.శుక్రవారం నాడు 18 జిల్లాలలో పరిస్థితిని సమీక్షించిన ఎన్నికల బృందం, శనివారం మరో 8 జిల్లాలకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించింది. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై ఎన్నికల బృందం ఆరా తీసింది. ఓటర్ల జాబితాలో అవకతవకలపై కూడా ఎన్నికల అధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది. ఏప్రిల్ లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందంటూ ఎన్నికల బృందం సూచనప్రాయంగా వెల్లడించింది. సమయం ఎక్కువగా లేనందున యుద్ధప్రాతిపదికన సన్నద్ధం కావాలంటూ కలెక్టర్లు, ఎస్పీలకు సూచించింది. ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రభావాన్ని అరికట్టాలని ఎన్నికల బృందానికి నాయకత్వం వహించిన డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ధర్మేంద్ర శర్మ కలెక్టర్లను, ఎస్పీలను ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను కట్టుదిట్టం చేయాలని, చెక్ పోస్టులపై ఒక కన్ను వేసి ఉంచాలని సూచించారు. ఇదిలావుంటే కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులతో టీడీపీ, జనసేన నేతలు సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఓట్ల జాబితాలో అక్రమాలు జరిగాయని టీడీపీ, జనసేన నేతలు ఫిర్యాదు చేయనున్నారు. నిన్న ఈ రోజు ఎన్నికల సన్నద్ధతపై కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష చేసింది. కలెక్టర్లు, ఎస్పీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించింది. టీడీపీ నేతలు వర్ల రామయ్య, దూళిపాల నరేంద్ర, అశోక్ బాబు, బోండా ఉమ నోవాటెల్ చేరుకున్నారు.

# జిల్లాలో 2వేల డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం

## పేదల కోసం వంద ఎకరాలు కేటాయించాం

## సూర్యాపేట పర్యటనలో మంత్రి ఉత్తమ్ ప్రకటన

**సూర్యాపేట,డిసెంబర్23(మరో ఉదయం):**

జిల్లాలో 2వేల డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించి 100 ఎకరాల స్థలంలో పేదల కోసం కేటాయించామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం నాడు సూర్యాపేట జిల్లాలో పర్యటించిన సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఇళ్లని పూర్తి చేసి లబ్దిదారులకు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అర్హులకు మోడల్ కాలనీలో ఇళ్లు కేటాయిస్తామన్నారు. పదేళ్లలో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కట్టింది 270 ఇళ్లు మాత్రమే. చాలా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు పనిచేయడం లేదు..100రోజులో అన్నీ పూర్తి చేసి చూపిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 84 ఎకరాల్లో నిర్మించిన ఇళ్లను ఎంత ఖర్చయినా రానున్న 5నెలల్లోనే పూర్తి చేసి ప్రజలకు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం నాడు మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఉప ఎన్నికల సమయంలో ఎన్నో వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేసింది. ప్రభుత్వ భూముల రికార్డులు మార్చి కబ్జా చేసిన భూమిని తిరిగి తీసుకొని మళ్లీ పేద ప్రజలకు అందిస్తాం. ఇది ఇందిరమ్మ రాజ్యం పేదల రాజ్యం.గతంలో అమాయకులపై కేసులు పెట్టి ఇబ్బంది పెట్టారని చెప్పారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా బీఆర్ఎస్ నేతలు మార్చారని, మనం దాని సమర్థవంతంగా మారుస్తూ, అభివృద్ధిలో నడిపిస్తామని అన్నారు. 27వ తేదీన అందరికీ తీపికబురు అందుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇదిలావుంటే పాలేరునియోజకవర్గం కూసుమంచిలో రెవెన్యూశాఖ ,గృహనిర్మాణ, సమాచారా శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లి వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. ద్విచక్ర వాహనాల ర్యాలీని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు నిర్వాహించారు.




# ప్రేమతత్వమే ఏసు మార్గం

## క్రీస్తు జన్మించిన రోజునే క్రిస్మస్

**విజయవాడ,డిసెంబర్23 (మరో ఉదయం):**

ఏసు క్రీస్తు పుట్టిన రోజును క్రిస్మస్‌గా జరుపుకుంటారు. ఏసుక్రీస్తు జన్మదిన సందర్భంగా క్రైస్తవులు జరుపుకునే పండుగ క్రిస్మస్. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు దీన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. జీసస్ జన్మించి నేటికి రెండు వేల ఏళ్లు దాటినా కరుణామయుడుగా, దయామయుడుగా ఆయన క్రైస్తవుల ఆరాధనలను అందుకుంటున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైవస్తవులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ క్రిస్మస్. క్రీస్తు జన్మించిన రోజు కావడం వల్లే క్రిస్మస్ జరుపుకుంటున్నారు. ఏసు అంటే రక్షకుడు అని అర్థం. క్రిస్మస్ క్రైస్తవులకు ముఖ్యమైన పండగ.

దేవుడు కొలువుదీరేది ఆత్మలో అయితే... దానికి మార్గం– క్రీస్తు బోధించిన ప్రేమతత్వం, కరుణ, క్షమ. 'సంపూర్ణ మానవత్వమే మనిషిని మహాపురుషుడిగా, దైవస్వరూపుడిగా మారుస్తుంది'– ఇదే క్రిస్మస్ పర్వదినం ద్వారా సమస్త మానవాళికి అందే శుభసందేశం. కొంతమంది క్రైస్తవులు డిసెంబర్ 25న, మరికొంత మంది ఆర్థడాక్స్ చర్చిలకు చెందిన క్రైస్తవులు జనవరి 7న క్రిస్టమస్‌ను జరుపుకుంటారు. రెండు వేల ఏళ్ల కిందట రోమ్ సామ్రాజ్యాన్ని పాలించే ఆగస్టస్ సీజర్ తన రాజ్యంలో ఎంత మంది జనాభా ఉన్నారో లెక్కించాడు. సులభంగా ఈ లెక్కలు సేకరించడానికి వీలుగా ప్రజలందరూ ఎవరి స్వగ్రామాలకు వాళ్లు డిసెంబరు 25 తేదీలోగా చేరుకోవాలని ఆజ్ఞాపించాడు. అదే సమయంలో రోమన్ సామ్రాజ్యంలోని నజరేతు పట్టణంలో ఉండే మేరీతో జోసెఫ్‌కు పెళ్లి కుదిరింది. ఒక రోజున మేరీకి గాబ్రియేల్ అనే దేవదూత కలలో కనబడి 'ఓ మేరీ! నీవు దైవానుగ్రహం పొందావు. కన్యగానే గర్భం దాల్చి ఓ కుమారునికి జన్మనిస్తావు. నీకు పుట్టే బిడ్డకు ఏసు అని పేరు పెట్టాలి. అతడు దేవుని కుమారుడు' అని చెప్పాడు.



నజరేయుడైన యేసుగా కూడా పిలవబడే ఈయన క్రైస్తవ మత మూల పురుషుడు. ఇందులో క్రీస్తు అన్న పదము గ్రీకు భాషలో క్రీస్తోస్ ('అభిషిక్తుడు') అనే అర్థం వచ్చే పదం నుండి పుట్టిన ముకుటం. ఇది హీబ్రూలో 'మెసయ్యా'కు సమానార్థము కలపదము. రెండువేల సంవత్సరాల క్రితం సంగతి. ఒక అభాగ్యురాలు, సమాజ నిరాపేక్షకు గురైన ఒక స్త్రీ ఆ జనం ఎదుట దోషిగా నిలబడింది. ఆమె చుట్టూ ఉన్నవారి చేతుల్లో రాళ్ళు. పాపం చేసినవారిని రాళ్ళతో కొట్టి చంపడం ఆ దేశంలో ఉన్న దారుణమైన ఆచారం. ఇంతలో వారి మధ్యలోకి ఒక ఆజానుబాహువు వచ్చాడు. ఆయన ముఖంలో తేజస్సు. రాళ్ళతో కొట్టబోతున్నవారు ఒక్కక్షణం ఆగారు. 'మీలో పాపం చేయనివారెవరు? పాపం చేయని వారు ఎవరైనా ఉంటే, ముందుగా వారే రాయి విసరండి' అన్నాడాయన. అంతా ఒక్కసారి వెనుతిరిగారు. వారి చేతుల్లోని రాళ్ళు కింద పడ్డాయి. ఆమె చేతులు జోడించి ఆయన ముందు మోకరిల్లింది. ఆయనే ప్రభువైన యేసుక్రీస్తు. పాపం చేసినవారికి శిక్ష విధించడం కాదు. పాపమే మరణించాలి. అలా జరిగితే పాపంలేని మనిషి పాపరహితుడై యేసుక్రీస్తులా మారతాడని దేవుని నమ్మకం. అందుకే నశించిన దాన్ని వెదికి రక్షించే నిమిత్తం ఆయన తన అద్వితీయ కుమారుడైన యేసు క్రీస్తును ఈలోకానికి పంపాడని విశ్వసిస్తారు. అలా సమస్త మానవాళి పాపపరిహారార్థం దేవుడు నరుడిగా జన్మించిన పవిత్రమైన రోజే క్రిస్మస్. యేసుక్రీస్తు జన్మించినప్పుడు ఆకాశంలో ఒక నక్షత్రం వెలసింది. ఆ నక్షత్రాన్ని అనుసరించి వెళ్ళి బాలయేసును దర్శించిన ముగ్గురు జ్ఞానులు పరమానంద భరితులయ్యారు. ఆ సంతోషానికి గుర్తుగా వారు బాలయేసుకు మూడు కానుకలను సమర్పించారు. అవి బంగారము, బోళం, పరిమళ సాంబ్రాణి. వారు సమర్పించిన బంగారం క్రీస్తు ప్రభువు పరిశుద్ధతకు, పవిత్రతకు చిహ్నంగా కనబడుతుంది.

# Devotional News

## కర్నూలులో క్రిస్మస్ సందడి

**కర్నూలు,డిసెంబర్23(మరో ఉదయం):**

నగరంలో క్రిస్మస్ సందడి పెరిగింది. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, క్యాండిల్ లైటింగ్ వేడుకలు జరుగుతున్నాయి. చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ వేడుకలకు అవసరమైన స్టార్లు, ట్రీలు, అలకంరణ సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. క్రీస్తు జననానికి గుర్తుగా క్రైస్తవులు తమ ఇళ్లపై స్టార్‌లను ఏర్పాటు చేసారు. మార్కెట్లో వివిధ ఆకృతులు, అలంకారాల్లో ఉన్న స్టార్లను, క్రిస్మస్ ట్రీలను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. పండుగ రోజున పిల్లలకు మిఠాయిలు పంచే శాంతాక్లాజ్ టోపీలు, కోట్లను కొనుగోలు చేస్తున్నారు. నగరంలో పాత బస్టాండు, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, మద్దూరునగర్, సి.క్యాంపు,

## క్రిస్మస్‌కు ముస్తాబైన మెదక్ చర్చి

### విద్యుద్దీపాలతో ధగధగలు

**మెదక్,డిసెంబర్23(మరో ఉదయం):**




ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన, అత్యుత్తమ కట్టడాల్లో ఒక్కటైన మెదక్ సీఎస్ఐ చర్చి క్రిస్మస్ శోభను సంతరించుకున్నది. విదద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులు చర్చిలో ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్రిస్మస్ వేడుకలను కనుల విందుగా జరిపేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసారు. చర్చిని విద్యుత్‌దీపాలతో అంగరంగ వైభవంగా ముస్తాబు చేసారు. 25న జరిగే క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. క్రిస్మస్ వేడుకలకు మెదక్ నుంచే కాకుండా తెలంగాణలోని పలు జిల్లాల నుంచి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు, పర్యాటకులు తరలివస్తుంటారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు చర్చి కమిటీ సభ్యులు తెలిపారు. ఇక చర్చి ప్రాంగణంలో వివిధ రకాల గృహ అలంకరణ, ఆటబొమ్మల దుకాణాలు వెలిశాయి. రంగుల రాట్నం, మినీ ఈత కొలనులు, జంపింగ్ గేమ్స్, మినీసర్కస్, మినీరైల్, పిల్లలు ఆడుకునే ఆట బొమ్మలను ఏర్పాటు చేశారు. శనివారం నుంచే ప్రార్థనలు మొదలయ్యాయి. వేలాదిగా క్రిష్టియన్లు తరలి వస్తున్నారు.

# తిరుమలకు పోటెత్తిన భక్తులు

### అర్థరాత్రి నుంచే వైకుంఠద్వార దర్శనం

### నిత్య కైంకర్యాల తరవాత దర్శనాలకు అనుమతి

### ఉత్తరద్వారా దర్శనంతో పులకించిన భక్తజనం

**తిరుమల,డిసెంబర్24(మరో ఉదయం):**

తెలుగు రాష్టాల్లో వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకవజాము నుంచి తెరుచుకున్న వైకుంఠ ద్వారం గుండా స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా తిరుమలలో ఏడు కొండలు పూర్తిగా జనంతో నిండిపోయాయి. విఐపీలు, సామాన్యులు అంతా ఉత్తర ద్వార దర్శనం చేసుకొని పరవశించిపోయారు. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా వైకుంఠ ద్వారం తెరుచుకుంది. శనివారం వేకువజామున 1:30 గంటలకు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా శ్రీవారి ఆలయానిక పక్కనే ఉన్న వైకుంఠ ద్వారం తెరిచారు.ముందుగా శ్రీనివాసుడికి నిత్య కైంకర్యాలు, తిరుప్పావై పఠనం చేసిన తర్వాత భక్తులను వైకుంఠ ద్వారం గుండా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి టిటిడి అధికారులు అనుమతించారు. ఈ సందర్భంగా టిటిడి పాలక మండలి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి పర్వదినంను తిరుమలలో ఘనం నిర్వహిస్తున్నామని అన్నారు. భక్తులంతా చాలా సంతృప్తితో వైకుంఠ ద్వరం గుండా స్వామి వారిని దర్శించి తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు కరుణాకర్‌రెడ్డి తెలిపారు. భక్తులకు సంతృప్తికరంగా దర్శనం కల్పించడంలో టిటిడి సఫలం అయ్యిందన్నారు. టిటిడి ఈవో ఏవి.ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది వైకుంఠ ద్వార దర్శనం 1:40 గంటలకు ప్రారంభమైందన్నారు. మొత్తం 4వేల విఐపి టోకెన్లు జారీ చేయగా 3,850 టికెట్లు మాత్రమే అమ్ముడు పోయినట్టు వెల్లడించారు. వేకువజామున 1:40కి ప్రారంభమైన విఐపి బ్రేక్ దర్శనాలు ఉదయం 5:15కి ముగిసిందన్నారు. ఎస్ఎస్డి, ఎస్ఈడి స్లాట్స్‌ను ఉదయం 6 గంటలకు ఇచ్చామని ధర్మారెడ్డి తెలిపారు. 45 నిమిషాల ముందే సామాన్య



భక్తులకు వైకుంఠ ద్వారం గుండా స్వామి వారి దర్శన భాగ్యం కల్పించామని వివరించారు. ప్రతి స్లాట్ కూడా గంటన్నర ముందుగా తీసుకుని వైకుంఠంలో కూర్చోబెట్టి, భక్తులకు దర్శనం చేయించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఒక వేళ భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లో వేచి ఉండే పరిస్థితి వస్తే, గంటా, రెండు గంటల కంటే ఎక్కువ సేపు వేచి ఉండే పని ఉండదని, భక్తులందరికి ఆహార పదార్థాలు, కాఫీ, టీ,పాలు అందిస్తున్నామని ఈవో వెల్లడించారు. తిరుపతిలో ఉచిత టోకెన్ల జారీ పక్రియలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూశామన్నారు. ఎస్ఎస్డి, ఎస్ఈడి టోకెన్లు కలిపి ప్రతి రోజు స్వామి వారి కైంకర్యాలు బట్టీ రోజుకి 70 నుంచి 75 వేల మందికి దర్శనం కల్పిస్తామన్నారు. పది రోజుల్లో ఎనిమిది లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామని టిటిడి ఈవో ఏవి.ధర్మారెడ్డి తెలియజేశారు..తిరుమలలో శుక్రవారం అర్థరాత్రి 1.45 గంటలకు వైకుంఠ ద్వారం తెరచుకుంది. శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు స్వామివారిని ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. శ్రీశైల క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రావణవాహన సేవలో భక్తులకు స్వామివారు,

# తిరుమలల విఐపిల సందడి

## ఉత్తరద్వార దర్శనం చేసుకున్న ప్రముఖులు

## మంత్రులు,న్యాయమూర్తుల రాక

**తిరుమల,డిసెంబర్24(మరో ఉదయం):**

వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వైకుంఠ ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తలు బారులు తీరారు. తెల్లవారుజామున 1:40 గంటల నుంచి 5:15 గంటల వరకు ప్రముఖులను శ్రీవారిని దర్శించు కునేందుకు టీటీడీ అనుమతి ఇచ్చింది. ఉదయం 5:15 గంటలకు సర్వదర్శనం భక్తులను దర్శనానికి టీటీడీ అనుమతించింది. తెల్లవారుజామునే శ్రీనివాసుడిని పలువురు ప్రముఖులు వైకుంఠ ద్వారం గుండా దర్శించుకున్నారు. వారిలో సుప్రీంకోర్టు మాజీ సీజె ఎన్వీ రమణ దంపతులు,సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రశాంత్ కుమార్ మిశ్రా, హిమా కోహ్లీ, స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ స్పీకర్ వీరభద్ర స్వామి, చీఫ్ విప్ ప్రసాద్ రాజు, మంత్రులు రోజా, అంబటి రాంబాబు, విశ్వరూప్, నారాయణ స్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆదిమూలపు సురేష్, నాగేశ్వరావు, గుడివాడ అమర్నాథ్, జయరాం, ఉషశ్రీ చరణ్, నాగార్జున, వేణుగోపాల కృష్ణ, రాజన్న దొర, కర్ణాటక గవర్నర్ తవర్ చంద్ గేహ్లాట్, ఎంపీలు రఘురాం రాజు, కేశినేని నాని, రామ్మోహన్ నాయుడు, మిథున్ రెడ్డి, సీఎం రమేష్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నిర్మాత బండ్ల గణెళిష్, నటుడు రాజేంద్ర ప్రసాద్, రక్షణ శాఖ సలహాదారుడు సతీష్ రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వీఐపీలకు 4వేల పాసులు జారీ చేసినట్లు టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. తెల్లవారుజామున 3:30 గంటల పాటు ప్రముఖులను దర్శనానికి అనుమతించా మన్నారు. సర్వదర్శనం భక్తులకు త్వరగతిన దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేశామన్నారు. సర్వదర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన 70 వేల మంది భక్తులను నిత్యం దర్శనానికి అనుమతిస్తామన్నారు. 10 రోజుల్లో 8 లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనం కల్పిస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు.




# ఆలయాల్లో వైకుంఠ సందడి

### ఉత్తర ద్వార దర్శనాలకు పోటెత్తిన భక్తులు

### యాదాద్రీశుడిని దర్శించుకున్న మంత్రి తుమ్మల

**యాదాద్రి,డిసెంబర్23(మరో ఉదయం):**

తెలంగాణలోని పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి. ఉత్తర ద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శించుకునేందుకు శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాల దగ్గర బారులు తీరారు. యాదగురిగుట్టలో ఉదయం 6.42 గంటలకు ఉత్తర రాజగోపురం చెంత నరసింహుడు మహావిష్ణువు రూపంలో దర్శనమిచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కుటుంబసభ్యులతో నరసింహస్వామిని దర్శించుకున్నారు. యాదగిరిగుట్ట లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. గరుడ వాహనంపై శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. భద్రాచలంలోనూ అధ్యయనోత్సవాల్లో భాగంగా వైకుంఠ ఏకాదశి వేడుకలను నిర్వహించారు. వైకుంఠ ద్వారం గుండా దర్శనమిస్తున్న స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వేములవాడ రాజన్న ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా హరిహరులు భక్తులకు దర్శన మిచ్చారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యేలు లక్ష్మణ్ కుమార్, వివేక్ వెంకటస్వామి పాల్గొని, స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు జరిగాయి. వైకుంఠ ఏకాదశికి జిల్లాలోని వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. సిద్దిపేట లోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారిని మాజీ మంత్రి హరీశ్ రావు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణ కుంభంతో హరీష్ రావుకు స్వాగతం పలికారు. దుబ్బాక పట్టణంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర



స్వామి దేవాలయం లో ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు జరిగాయి. ఆ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు.వరంగల్ జిల్లాలోని ఆలయాలన్నీ గోవింద నామస్మరణతో మారుమోగుతున్నాయి. వరంగల్ చౌరస్తాలోని గీతా భవన్‌లో వేంకటేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కాశిబుగ్గలోని రంగనాయక స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఇక వరంగల్‌లో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బట్టల బజార్‌లోని బాలానగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు జరుగుతున్నాయి. ఉత్తర ద్వారం గుండా స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే తుడి మెగారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో వెంకటేశ్వర స్వామి, గంగాపురంలో శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాలలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం గుండా స్వామివారిని భక్తులు దర్శించు కున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయం లో వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు జరిగాయి. ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు హరి హరులు దర్శనం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు.జగిత్యాల జిల్లాలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి

దంపతులు పాల్గొని ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు.వైకుంఠ ఏకాదశి సందర్భంగా ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో తెల్లవారుజామున 2.30 గంటల నుంచే స్వామివారి మూల విరాట్లకు మహా క్షీరాభిషేకం నిర్వహించారు.

Edited,printed,published and Owned by sredharPrinted at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com